చట్టాలపై అవగాహన కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్

కామారెడ్డి, జనవరి 25 : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు, మహిళలు, బాధితులతోపాటు ఎక్కడైతే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయో తెలుసుకొని, వాటిపై దృష్టిసారించి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, డిస్ట్రిక్ట్ చిల్డ్రన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతి, స్వర్ణలత, జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీక్ష తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి సబ్‌జైలు సందర్శన

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి

కామారెడ్డి, జనవరి 25 : కామారెడ్డి ఉపకారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి శనివారం సందర్శించారు. ఖైదీల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.ఖైదీలకు వారి హక్కులు, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్‌రావు, సబ్ జైల్ సూపరింటెండెంట్ సంజీవరెడ్డి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది సాయిప్రతీణ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి అదృశ్యం

నస్రుల్లాబాద్/నిజాంసాగర్, జనవరి 25: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కొండల్‌వాడి సంతోష్ (39) అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన బయటికి వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడని పేర్కొన్నారు. ఇంటికి రాకపోవడంతో సంతోష్ కోసం ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వడ్డేపల్లి గ్రామానికి చెందిన మరొకరు

నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన దర్జి భిక్షపతి (37) అదృశ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. భిక్షపతి శుక్రవారం సాయంత్రం తన భార్యతో గొడవపడి రాత్రి 8 గంటలకు ఇంటినుంచి వెళ్లిపోయాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భిక్షపతి బైక్ గ్రామశివారులోని పాపేశ్వరుని కుంట వద్ద లభించింది. తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

కామారెడ్డిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

- జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞలు
- ఓటు హక్కు విలువను కాపాడాలి: అదనపు కలెక్టర్ విక్టర్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 25: : జిల్లాలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మానవహారాలు నిర్మించి, ప్రతిజ్ఞ చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు విలువను కాపాడాలన్నారు.నిజాయితీ పరులకు ఓటు వేయడం ద్వారా సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చని తెలిపారు. పట్టణాల్లో పోలింగ్ శాతం తక్కువగా, పల్లెల్లో ఎక్కువగా నమోదవుతున్నదన్నారు. చదువుకున్నవారు ఓటు వేయడం బాధ్యతగా గుర్తించాలని సూచించారు. అంతకుముందు పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

బాన్సువాడలో తహసీల్ ఆఫీస్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిర్వహించిన ఓటరు ర్యాలీలో సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. బాన్సువాడ మండలంలోని పలు గ్రామాల్లో 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం బీఎల్‌వోలకు దరఖాస్తులు చేసుకున్నారు. నస్రుల్లాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాలలో ర్యాలీ, మానవహారం నిర్వహించగా, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.భిక్కనూరులో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.రాజంపేటలో బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

బాధ్యతాయుత నాయకులను ఎన్నుకోవాలి

బాధ్యతాయుత నాయకులను ఓటుహక్కుతో ఎన్నుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మద్నూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గాంధారి మండల కేంద్రంతో పాటు పేట్ సంగెంలో ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ శాఖల అధికారులు ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పట్టణంలోని సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. లింగంపేటలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ఓటరు ప్రతిజ్ఞ చేశారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయం ఎదుట ఓటర్ల దినోత్సవం సందర్భంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. పిట్లం మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయం, పాఠశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి ఘనంగా నిర్వహించారు. రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఓటర్స్ డే సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. నాగిరెడ్డిపేట కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులు ఓటు హక్కు విలువను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. బిచ్కుంద మండలంలోని సిర్‌సముందర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

మద్నూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు సన్మానం

నస్రుల్లాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భిక్కనూర్‌లో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

హన్మాజీపేట్‌లో కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తులను బీఎల్‌వోలకు అందజేస్తున్న యువత

బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహాదారుడు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి పాల్గొన్నారు. -బాన్సువాడ, జనవరి 25

జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గానికి వీడ్కోలు సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. -కామారెడ్డి, జనవరి25

'గణతంత్ర' వేడుకలకు ఏర్పాట్లు

కామారెడ్డి,జనవరి 25 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. జిల్లా కోర్టు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో రిపబ్లిక్ వేడుకలు నిర్వహించనున్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, జనవరి 25 : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్టీవో కార్యాలయంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడంతోనే మరణిస్తున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా మరణాల సంఖ్య తగ్గించవచ్చని అన్నారు.

నూతన మహిళా సంఘాల ఏర్పాటు

రాజంపేట్, జనవరి 25: మహిళా సంఘాల్లో 252 మంది మహిళలను గుర్తించి నూతన మహిళా సంఘాల్లో చేర్పించినట్లు ఏపీఎం సాయిలు తెలిపారు. రాజంపేట మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని అధ్యక్షురాలు సుతారి లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పుస్తకాల అంతర్గత తనిఖీ చేయాలని వీవోలకు సూచించారు. బ్యాంకు లింకేజీ రూ.26.26కోట్లకు గాను పూర్తిగా 100శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు.

విద్యార్థులకు కిట్స్ పంపిణీ

నస్రుల్లాబాద్, జనవరి 25: బీర్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మున్నూరు కాపుయూత్ ఆధ్వర్యంలో మార్చ్‌ఫాస్ట్‌కు సంబంధించిన కిట్స్‌ను శనివారం పంపిణీ చేశారు. బీర్కూర్ గ్రామానికి చెందిన గాలయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కిట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. యాత్ అధ్యక్షుడు సాయి,ఉపాధ్యక్షుడు ధర్మతేజ, సాయికుమార్, గంగాధర్, రాములు ఉన్నారు.

సూపర్‌మార్కెట్‌లో దొంగతనం

కామారెడ్డి, జనవరి 25 : గోడకు కన్నం వేసి సూపర్‌మార్కెట్‌లో చోరీ చేసిన సంఘటన కామారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్న ది. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శక్రవా రం అర్ధరాత్రి అశోక్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న విజయ సూపర్ మార్కెట్‌లో దుండగులు గోడకు కన్నం వేసి లోపలికి చొరబడ్డారు. కొంత నగదు, ఇన్వర్టర్, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం గమనించిన షాపు యాజమానులు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలిని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

భిక్కనూరు, జనవరి 25: ఆలయాల్లో చోరీకి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో గురువారం రాత్రి ఓ దుండగుడు ఎల్లమ్మ ఆలయంలోకి చొరబడి హుండీలో నుంచి డబ్బులను దొంగతనం చేశాడు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన నేతుల వినోద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడని ఎస్సై తెలిపారు. శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

లింగంపేట, జనవరి 25: మండలంలోని నల్లమడుగు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావును పీఆర్టీయూ టీఎస్ మండల నాయకులు శనివారం సన్మానించారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కోటేశ్వర్‌రావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రవీంద్రశర్మ, ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్‌గౌడ్, మండల అసోసియేట్ అధ్యక్షుడు పారు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామారెడ్డి(సదాశివనగర్), జనవరి 25 : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సదాశివనగర్ ఎస్సై రంజిత్ కథనం ప్రకారం.. ఇందల్‌వాయి మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన లింగాపురం రవి(36) శనివారం ద్విచక్రవాహనంపై తన భార్యాపిల్లలను ఎక్కించుకొని కామారెడ్డి వైపు నుంచి తన గ్రామానికి వెళుతున్నాడు. సదాశివనగర్ గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై బైక్‌ను లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో రవి అక్కడికక్కడే మరణించాడు. భార్యాపిల్లలకు గాయాలయ్యాయి. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధుల నుంచి కాంట్రాక్ట్ వైద్యుడి తొలగింపు

లింగంపేట, జనవరి 25: మండల కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పేరుతో డబ్బుల వసూలుకు పాల్పడిన కాంట్రాక్ట్ ఉద్యోగి సామల బాలకృష్ణను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. లింగాపూర్ గ్రామంలోని పల్లె దవఖానాలో కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఈ నెల 17న లింగంపేటలో ఇద్దరు ప్రైవేటు వైద్యుల నుంచి రూ.25వేలు వసూలు చేశాడు. అనుమానం వచ్చిన వైద్యులు విచారించగా బాలకృష్ణ భాగోతం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు బాలకృష్ణపై కేసు నమోదు చేశారు. డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అనంతరం బాలకృష్ణను పల్లె దవఖానలో విధుల నుంచి తొలగించారు.

ఎల్లారెడ్డి గురుకులంలో ఫొటో ఎగ్జిబిషన్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 25: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 'ఫొటో ఎగ్జిబిషన్ ఆన్ మేకింగ్ ఆఫ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్' అనే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను జిల్లా గురుకులాల ఎంట్రన్స్ టెస్ట్ నోడల్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. సొంత ఖర్చులతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిన అధ్యాపకుడు శివకిశోర్‌ను ఆయన శాలువాతో సన్మానించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★ I, **SYEDA FATIMA SHEERAZ** D/o. SYED ATEEBUDDIN SHEERAZ, H.No. 12-1-50/B/3, Sadaat Enclave, New Fruit Market, Arsapally, Nizamabad, T.G., I have lost my original Indian Passport bearing No.**Y1666829** while going for xerox copy From Fruit Market to Natraj Talkies, Bodhan Road, Nizamabad on 10-01-2025, If anybody found please Call:9177505507
NTZ-7060

CHANGE OF NAME

★ I,YELDI MANJULA SUDARSHAN (Old Name) Residing at H.NO:1-1-47, Vinayak Nagar, Nizamabad, Telangana - 503001, hereby declare that I have Changed my name to **ENUGANDULA POOJITHA** (New Name) W/o. ENUGANDULA JAYASIMHA.
NTZ-338457

WANTED

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

ఆదర్శ పాఠశాలలో మాక్ ఎలక్షన్స్

మాక్ ఎలక్షన్‌లో గెలుపొందిన విద్యార్థి అంకిత్‌కు నియామకపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ రాంప్రసాద్

నాగిరెడ్డిపేట, జనవరి 25: మండల కేంద్రం గోపాల్‌పేట ఆదర్శ పాఠశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు మాక్ ఎలక్షన్ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 10వ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులతో నామినేషన్లు వేయించారు. పాఠశాలలో తరగతిల్లోకి వెళ్లి ప్రచారం చేశారు. తమకు కేటాయించిన గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పాఠశాలలోని 6వ తరగతి నుంచి ఇంటర్ రెండోసంవత్సరం విద్యార్థుల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రథమ స్థానంలో నిలిచిన కీర్తిసాయి పాఠశాల హెడ్‌గర్ల్‌గా, అంకిత్‌ను హెడ్‌బాయ్‌గా ప్రకటించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ వారికి నియామకపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాక్ ఎలక్షన్‌ను ప్రత్యేక్షంగా వీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

లింగంపేటలో కల్వర్టును పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట, జనవరి 25: మండల కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శనివారం పరిశీలించారు. 49 లక్షల రూపాయలతో పంట కాలువ మరమ్మతులు, కల్వర్టులు, 5లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాలువపై రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. కల్వర్టుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎల్లమయ్య, జొన్నల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్, మోహిద్, దేశ్‌ముఖ్ రాజు, అట్టెం శ్రీనివాస్, సాయికుమార్, పీర్‌సింగ్, ఏదుల్, రాంరెడి తదితరులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

ఎల్లారెడ్డిరూరల్, జనవరి 25: పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శనివారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 5,6,7,8,12 వార్డుల్లో సీసీ రోడ్లు, డైనేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి అనంతరం ఎల్లారెడ్డి బస్టాండులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయనతో పాటు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత..

లింగంపేట(తాడ్వాయి), జనవరి 25: తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన భూమయ్యకు 2.50 లక్షల రూపాయల ఎల్‌వోసీపత్రాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్ శనివారం అందజేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భూమయ్యకు ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్ కోసం డబ్బులు లేకపోవడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను సంప్రదించగా ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి ఎల్‌వోసీ పత్రం అందించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం..

గాంధారి, జనవరి 25: మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా పనులకు శంకుస్థాపనతో పాటు భూమి పూజ నిర్వహించారు. అనంతరం మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని పెద్ద వాగు, పోచమ్మ రేవు, సంగెం రేవుపై వంతెన నిర్మాణం చేపట్టే ప్రదేశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మెదడులో
నెగెటివ్ ఆలోచనలకు తావివ్వొద్దు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 25: విద్యార్థులు తమ మెదడులో నెగెటివ్ ఆలోచనలకు తావు ఇవ్వవద్దని, నెగెటివ్ ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని పాజిటివ్ ఆలోచనలతో తోసివేయాలని ఈసీఎస్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ మృదుల సలహానిచ్చారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఈసీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్ అంశంపై పలు విషయాలను వివరించారు. అనంతరం ఈసీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చంద్రశేఖరన్, సభ్యులు డాక్టర్ మృదుల, డాక్టర్ కిరణ్‌కుమార్‌ను ఎంఈవో వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు

ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులతో ఈసీఎస్ ఫౌండేషన్ నిర్వాహకులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 25: కొద్దిపాటి జాగ్రత్తలను తీసుకుంటే సెల్‌ఫోన్లు, వ్యక్తిగత వస్తువులను కోల్పోకుండా ఉంటారని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఆయన కార్యాలయంలో సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లభించిన సెల్‌ఫోన్‌ను లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గణేశ్‌కు అప్పగించి మాట్లాడారు.

నిజామాబాద్ తరలిన నాయకులు

లింగంపేట/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్, జనవరి 25: లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లోని ఆయా గ్రామాలు, ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించే 'వేయి గొంతుకలు..లక్ష డప్పులు' కార్యక్రమం విజయవంతం కోసం నిజామాబాద్‌లో సన్నాహక సమావేశం నిర్వహించగా, మండల నాయకులు తరలివెళ్లారు. తరలిన వారిలో లింగంపేట మండల కమిటీ అధ్